క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


వెంకన్నపేటలో మహిళలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: వర్షాకాలం కావడంతో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీ, వెంకన్నపేట, మేథర్ మసీదు ప్రాంతాల్లో కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ తాగునీరు, మురుగు కాలువల సమస్యలు, వీధి దీపాలు వెలుగుతున్నాయా లేదానని అడిగి తెలుసుకున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

పెద్దకడబూరు: తల్లిపాలు బిడ్డలకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. మండల పరిధిలోని హెచ్.మురవణి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం బాలింతలు, గర్భిణులకు తల్లిపాల అవశ్యకతను తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో 6 సంవత్సరాలలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు వారి సమగ్ర పోషణ పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణవేణి, అంగన్‌వాడి కార్యకర్తలు పద్మ, అనిత పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి కిట్ల పంపిణీ


పారిశుధ్య సిబ్బందికి పీపీఈ కిట్లను అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎమ్మిగనూరుటౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య సిబ్బందికి పీపీఈ కిట్లను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ నీరజల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఆల్ఫ్రెడ్ రాజుకు సన్మానం


ఆల్ఫ్రెడ్ రాజుకు సన్మానం చేస్తున్న దృశ్యం

మంత్రాలయం : ఆల్ ఇండియా క్రిష్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల ఆల్ఫ్రెడ్ రాజుకు కర్ణాటక రాష్ట్రానికి చెందిన విప్రబాంధవ శ్రీనివాస కళ్యాణ సేవా సమితి, సప్త రుషి సౌహారద పత్తిన సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక శ్రీమఠం ఆవరణలో శ్రీ మధ్వ మార్గ కారిడార్ ఆవరణలో సంస్థల డైరెక్టర్ గురురాజ రావు చేతుల మీదుగా ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి అభినందించారు. గురురాజ రావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు సేవా కార్యక్రమంలో తరుచుగా పాల్గొనడం, ఆయనకు తోచిన సహాయం అందించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శంకర్, సతీష్‌లు ఉన్నారు.

సమగ్ర పోషణను సద్వినియోగం చేసుకోవాలి


పోషకాహారం ప్రాముఖ్యతను వివరిస్తున్న హెచ్‌ఎం సంజన్న

కోసిగి: అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వం అందించే సమగ్ర పోషణను సద్వినియోగం చేసుకోవాలని బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంజన్న సూచించారు. సోమవారం స్థానిక 5వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సక్షం అంగన్‌వాడీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతులు, 6 ఏళ్ల లోపు చిన్నారులకు అందించే పోషక విలువల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హెప్సిబా రాణి, మద్దమ్మ, నాగరత్నమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రౌడూరు విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు


సుధా పరిమళ

కౌతాళం: మండల పరిధిలోని రౌడూరు గ్రామానికి చెందిన విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు వరించింది. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 720 మార్కులకు గాను 680 మార్కులు సాధించిన రౌడూరు గ్రామానికి చెందిన ఆర్.ఎం. సుధా పరిమళ ఎంబీబీఎస్ సీటు వచ్చింది. స్టేట్ ర్యాంకులో 86 రాగా, ఆల్ ఇండియా స్థాయిలో 6,860వ ర్యాంక్ సాధించిందని తండ్రి కృష్ణానందారెడ్డి, తల్లి శారద తెలిపారు. తమ కుమార్తెకు హైదరాబాదు గాంధీ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఉచితంగా ఎంబీబీఎస్ సీటు వచ్చిందన్నారు.

‘మధ్యాహ్నం’ పస్తులేనా?

- జూనియర్ కళాశాలల్లో మిడ్‌డే మీల్స్ అమలు చేస్తామని కూటమి హామీ
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేస్తామని యువగళంలో నారా లోకేష్ ఉద్ఘాటన
- ఇంతవరకూ ఊసెత్తని ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న పేద విద్యార్థులు



ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర కళాశాలలో ఇంటి నుంచి క్యారియర్‌లు తెచ్చుకొని తింటున్న విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేసి తీరుతాం.. 2024–25 విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే ఇంటర్ విద్యార్థులకు కళాశాలల్లో భోజనం అందిస్తామని యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇక ఇంటి నుంచి క్యారియర్ మోసుకొచ్చే పని వుండదని చెప్పారు. నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు అందిస్తామన్నారు. అయితే విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదు. ఇంతవరకూ ఆ పథకం ఊసే లేదు.

గ్రామీణ విద్యార్థుల అవస్థలు

ఎమ్మిగనూరు పట్టణంలో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. వీటితో పాటు గోనెగండ్ల మండలలోని గాజులదిన్నె ప్రాజెక్ట్ వద్ద, నందవరం మండలంలోని నాగులదిన్నెలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో వందలాది మంది విద్యార్థులు ఉండగా.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారే సంఖ్య అధికంగా ఉన్నారు. ఆయా గ్రమాల విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో సారి ఇళ్ల నుంచి కళాశాలలకు క్యారియర్లు తెచ్చుకోలేక మధ్యాహ్నం పస్తులుండి చదువుకునే పేద విద్యార్థులు లేకపోలేదు. ఎన్నికల ముందు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువతను ఆకట్టుకునేందుకు హామీ ఇచ్చారు. హామీ మేరకు తమ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఎప్పుడు ప్రారంభిస్తారో అని విద్యార్థుకు ఎదురు చూస్తున్నారు.

నిరుపేద విద్యార్థులను మోసగించేలా హామీ



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని ప్రస్తుతం మంత్రి నారాలోకేష్ నాడు ఇచ్చిన హామీ మోసగించేలా వుంది. మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తారంటే పేద విద్యార్థులు ఎంతో సంతోషించారు. కళాశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా పథకంపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి. – వీరేష్‌యాదవ్, ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

వెంటనే అమలు చేయాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వెంటనే అమలు చేయాలి. పేద ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఒక వరం లాంటిదే. ఈ పథకం అమలు చేస్తే పేద విద్యార్థుల చదువులకు ఎంతో ఉపకరిస్తుంది. ప్రభుత్వం ఈ పథకం వెంటనే అమలు చేసేలా నిర్ణయం తీసుకోవాలి. లేకపోతే విద్యార్థుల నుంచి ప్రభుత్వం వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుంది. – విజయేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఎమ్మిగనూరు

యువగళం మూగబోయినట్లు కనిపిస్తోంది



ఇంటర్ విద్యార్థుల కోసం మధ్నాహ్న భోజన పథకం అమలు చేసేందుకు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ నాడు యువగళంలో ఇచ్చిన హామీ మూగబోయినట్లు కనిపిస్తోంది. ఈ విద్యాసంవత్సరం ఆరంభంలోనే అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచిపోయినా మధ్నాహ్న భోజనం అమలుపై ఎలాంటి ప్రకటన ఇవ్వకపోవడం సమంజసం కాదు. ప్రభుత్వం ఈ పథకంపై సత్వరం చర్యలు తీసుకోవాలి. – మహేంద్రబాబు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎమ్మిగనూరు

4న ఎమ్మిగనూరులో జాబ్‌మేళా

గోనెగండ్ల : అక్టోబర్ 4న ఎమ్మిగనూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన నిరుద్యోగులు ఈ జాబ్‌మేళను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఉద్యోగం వచ్చిన వారికి రూ.10వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఉంటుందని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక

ఆదోని టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం మున్సిపల్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలని, ఎస్కేడీ కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాలకు చెందిన ఇద్దరు, పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని మరొకరు దరఖాస్తులు అందజేశారు. ఆయా సమస్యలను పరిష్కరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కమిషనర్ సమాధానంగా చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారుకార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, డీఎల్‌పీఓ నూర్జహాన్, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఉప తహసీల్దార్ వలీబాషా తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ ప్రాంత సమస్యలను పరిష్కరించండి

ఆదోని సెంట్రల్: అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంత సమస్యలను పరిష్కరించాలని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు బాలు, కార్యదర్శి వంశీ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం నుంచి ముఖ్యమంత్రులు, మంత్రులు అయినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. పశ్చిమ ప్రాంతంలో వేదావతి, తుంగభద్ర, హంద్రీనీవా, ఆర్డీఎస్ కుడి కాలువ వంటివి పారుతున్నా ప్రజలకు ఉపయోగం లేదన్నారు. దీంతో అనేక మంది బతుకు తెరువు నిమిత్తం నిత్యం వలసలు వెళుతుంటారని తెలిపారు. చదువుకోవాలని ఆశ ఉన్నా పరిస్థితులు అనుకూలించక ఆర్థికపరమైన ఇబ్బందులతో చాల మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండలో టమాట జ్యూస్ ఫ్యాక్టరీ, పత్తి పరిశోదన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమములో ఎన్ఎస్‌యూఐ నాయకులు తరుణ్, దేవేంద్ర, వాసు, వినోద్, విజయ్, అశోక్ తదతరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తేనే గుర్తింపు


డ్రైవర్ మహబుబ్‌బాషాను సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగులు మెరుగైన సేవలందిస్తేనే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ అన్నారు. సోమవారం డిపో ఆవరణలో పదవీ విరమణ పొందిన డ్రైవర్ మహబుబ్‌బాషాను మేనేజర్‌తో పాటు సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. డీఎం మాట్లాడుతూ.. 27 సంవత్సరాలుగా డ్రైవర్‌గా మహబుబ్‌బాషా ఆర్టీసీలో ప్రయాణికులకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎంఎస్ వాసులు, నేషనల్ మజ్దూర్ యునిటీ అసోసియేషన్ కార్యదర్శి ముస్తాఖ్ అహమ్మద్, డిపో అసిస్టెంట్ మేనేజర్ జీవి.నాగరాజు, సూపరింటెండెంట్ పంపాపతి తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణాల తనిఖీ


దుకాణంలో మందులను పరిశీలిస్తున్న ఏడీఓ మహమ్మద్ ఖాద్రి

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో ఫర్టిలైజర్స్ దుకాణాలను వ్యవసాయ శాఖ ఏడీఓ మహ్మద్ ఖాద్రి, ఏఓ స్రవంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం స్థానికంగా శివాకిరణ్, నవీన్, శ్రీనివాస, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్, బిల్ బుక్స్, మందులను పరిశీలించారు. నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో పత్తి పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలిచ్చారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరుటౌన్: జిల్లా కేంద్రం కర్నూలులో జరిగిన సేపక్‌తక్ర పోటీల్లో పట్టణంలోని గుడ్‌బేస్ పాఠశాల విద్యార్థులు నక్షత్ర, సుహాస్‌లు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎబెల్ సోమవారం తెలిపారు. వీరు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీఈటీలు పావని, అలి, అనీల్‌లను ఆయన అభినందించారు.

ముగ్గురిపై దాడి.. 14 మందిపై కేసు నమోదు

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన ముగ్గురిపై దాడి చేసిన ఘటనలో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చిన్నతుంబళం గ్రామంలో ఆదివారం రాత్రి బోయ నాయుడు అదే గ్రామానికి చెందిన కామవరం గంగాధర్‌కు ఆటో తగిలిన విషయంలో గొడవపడి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. సోమవారం ఉదయం గంగాధర్‌కు మద్దతుగా ఉన్నాడనే నెపంతో కమ్మరి వీరేష్, గంగాధర్ తండ్రి బుడ్డప్ప, గంగాధర్‌పై బోయ నాయుడు, ఆయన తండ్రి తాయన్న, వారి కుటుంబసభ్యులు ఏడుగురు మగవారు, ఏడుగురు మహిళలు మొత్తం 14మంది దాడికి పాల్పడి విచక్షణ రహితంగా కొట్టారు. దీంతో ముగ్గురికి రక్త గాయాలు అయ్యాయి. కమ్మరి వీరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుప్పకూలిన ఓవర్‌హెడ్ ట్యాంకు


కూలిపోయిన ట్యాంకు

ఆదోని రూరల్: మండలంలోని చిన్నహరివాణం గ్రామంలోని ఎల్లెల్సీ కాలువ సమీపంలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకు సోమవారం కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు కుప్పకూలింది. ఓవర్‌హెడ్ ట్యాంకు కూలే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. సీపీఐ పార్టీ గ్రామశాఖ కార్యదర్శి మల్లేష్, కౌలు రైతు సంఘం నాయకులు వడ్డే సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని, కూల్చాలని గతంలో అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న మిగతా ట్యాంకులను కూల్చివేయాలన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

- వైస్ చైర్మన్ల సీట్లు తొలగించంపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల నిలదీత
- అన్నా క్యాంటీన్లు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అవినీతిపై విచారణకు పట్టుబట్టిన పాలకవర్గ సభ్యులు


చైర్మన్ పోడియం వద్ద నేలపై కూర్చొన్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు


చైర్‌పర్సన్ బోయ శాంతను నిలదీస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆదోని టౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యే పార్థసారథి కుర్చీలతో పాటు ఇద్దరు వైస్ చైర్మన్లు నరసింహులు, గౌస్‌కు సంబంధించిన కుర్చీలు ఉండాల్సి ఉండగా.. వాటిని తీయించి, కౌన్సిలర్లతో పాటు వేయించడంతో వైస్ చైర్మన్‌లు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. మూడున్నరేళ్లుగా లేని నిబంధనలు ఇప్పుడే వచ్చాయా అంటూ పాలకవర్గ సభ్యులు కమిషనర్, చైర్‌పర్సన్‌ను నిలదీశారు. పోడియం వద్ద నేలపై కూర్చొని నిరసన తెలియజేశారు. చైర్‌పర్సన్‌తో వాదనకు దిగారు. వైస్ చైర్మన్‌లు అంటే అంత చులకనా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. తమకు సమాచారం ఇవ్వకుండా కుర్చీలు ఎలా తీసేస్తారని నిలదీశారు.

అన్నా క్యాంటీన్‌ల బిల్లులు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్చ

మూడు అన్నా క్యాంటీన్‌లకు సంబంధించిన బిల్లులు, అర్ధంతరంగా ఆగిపోయిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులను పునః ప్రారంభించాలని వైస్ చైర్మన్‌లు నరసింహులు, గౌస్, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, ఫయాజ్, రఘునాథ్‌రెడ్డి, సురేష్ డిమాండ్ చేశారు. గత కౌన్సిల్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్చ జరిగిందని, అయితే నేటికీ పనులు ప్రారంభించలేదని పాలకవర్గ సభ్యులు తెలిపారు. అయితే ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి కల్పించుకుని అన్నా క్యాంటీన్‌లు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని, పనులు నాసిరకంగా ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో విచారించిన పిమ్మట బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. దీంతో పాలకవర్గ సభ్యులు, ఎమ్మెల్యే మధ్య వాదనలు జరిగాయి. నాణ్యతా ప్రమాణాలపై తక్షణమే విచారణ చేయించాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఫయాజ్‌అహ్మద్ పట్టుబట్టారు. వెంటనే క్వాలిటీ కంట్రోల్ అధికారులచే తనిఖీలు చేపట్టాలన్నారు.

కూటమి నాయకుల బకాయిలు వసూలు చేయాలి

మున్సిపాలిటీకీ వివిధ మార్కెట్ల వేలం పాటలు పాడి లక్షలాది రూపాయలు చెల్లించకుండా ఎగనామం పెట్టిన కాంట్రాక్టర్ల నుంచి ఎందుకు బకాయిలు వసూలు చేయడంలేదని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. బకాయిలు ఉన్న వారంతా కూటమికి చెందిన వారేనని, అయినప్పటికీ పట్టణాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిలు వసూలు చేయాలన్నారు.

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు మొక్కులో భాగంగా ప్రత్యేక అభిషేకాలను చేపట్టారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించండి

ఎమ్మిగనూరుటౌన్: నిత్యావసర సరుకుల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించి సామాన్య ప్రజలపై భారం తగ్గించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రకు అందజేశారు. సమాన్య ప్రజలు జీవించలేని స్థితిలో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఉన్నాయన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

నందవరం : జీఓ 117 సంపూర్ణంగా రద్దు చేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాశె వెంకటేశప్ప డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మద్దతు కోరుతూ కరపత్రాలు విడుదల జేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఈనెల 2వ తేదీన గాంధీ జయంతి రోజున గాంధీ విగ్రహాల వద్ద జీవో 117 సంపూర్ణ రద్దు, మాతృభాష అమలు కోసం నిరసనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు మండలంలోని ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తమ మద్దతు ఇవ్వాలని కోరారు.

హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో అధికారం చేపట్టి మూడు నెలలైందని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్‌జీఓ భవన్‌లో సోమవారం ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలపై గుప్పించిన హామీలు అమలు చేయడంలో కూటమి నాయకులు నిర్లక్ష్యం వహించడం శోచనీయమన్నారు. పేదల సాగులో వున్న భూములకు అన్ని హక్కులు కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం, పట్టణ ప్రాంతాల్లో వారికి రెండు సెంట్ల స్థలాన్ని ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నబిరసూల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపణ్ణగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగన్న, నాయకులు వెంకటరామిరెడ్డి, కోదండ, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రభూమి పరిరక్షణకు పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హిందూ రుద్రభూమి పరిరక్షణకై పోరాటం చేస్తామని, అవసరమైతే న్యాయ పోరాటానికి సైతం సిద్ధమని శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు, న్యాయవాది నారాయణ, మల్లికార్జున, మాధవస్వామి, బీఎల్ నారాయణ, బతకన్న, గణేష్ అన్నారు. సోమవారం స్థానిక యాదవ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రుద్రభూమి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. శ్మశాన భూమి కబ్జాపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయా కుల సంఘాల నాయకులు వెంకటేష్, బీరప్ప, యాపీలయ్య, లక్ష్మన్న, లోకేష్ పాల్గొన్నారు.

పంట ఉత్పత్తులను పెంచి అధిక లాభాలు పొందండి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రాధకుమారి

ఎమ్మిగనూరురూరల్: రైతులు పొద్దుతిరుగుడు పంట ఉత్పత్తులను పెంచి అధిక లాభాలు పొందాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్రచౌదరి, నంద్యాల ప్రాంతీయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డా.రాధకుమారి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూలు కులాల ఉప ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎస్సీ రైతులకు పొద్దుతిరుగుడు పంట సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి డ్రమ్ము, పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పడమటి ప్రాంతంలో పొద్దుతిరుగుడు సాగు విస్తీర్ణం చాల తక్కువగా ఉందని చెప్పారు. నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌లో కంది, కొర్ర, సజ్జ రకాలు అందుబాటులో ఉన్నాయని, అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో నంద్యాల శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరమణమ్మ, డా.రవిప్రకాశ్ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు డా. చందన, డా. మౌనిక, డా. నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి


మాట్లాడుతున్న జి.రాంభీంనాయుడు

ఆదోని రూరల్: అక్టోబర్ 17 వాల్మీకి జయంతిని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి (వీఆర్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాంభీంనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ అంశంపై కేంద్రంలో పెండింగ్‌లో ఉందని, కేంద్రంపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, హనుమన్న, భాస్కర్, పెద్దయ్య, బోయ సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి బస్సు నడపాలని ధర్నా

కోసిగి: విద్యార్థులకు పాఠశాలల వేళలకు విద్యార్థి బస్సులను నడపాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్‌లో గ్రామీణ ప్రాంత విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు, ఆదోని డిపోలకు చెందిన ఉదయం, సాయంత్రం వేళల్లో గత ప్రభుత్వ హయాంలో స్కూల్ బస్సులు నడిపేవారన్నారు. కొన్ని నెలలు క్రితం ఎమ్మిగనూరు నుంచి కంబళదిన్నె, మాలపల్లి, పల్లెపాడు, చింతకుంట గ్రామాలకు రోడ్డు సరిగ్గా లేదని బస్సు ఎత్తివేశారని తెలిపారు. విజయ్, దివాకర్, మహాలక్ష్మి, శివ, బడేసాబ్, గణేష్, వీరేంద్ర పాల్గొన్నారు.